
కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి


వందేభారత్ ఈ ఆటో తాళాలను సర్పంచ్‌కు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్


సూపర్ సిక్స్ పథకాలతో జరిగిన అభివృద్ధిని వివరించే కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

కొనసాగుతున్న ఇంటింటికీ టీడీపీ

చిత్తూరు, జూలై 4(ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలిఅడుగు పేరిట టీడీపీ చేపట్టిన కార్యక్రమంలో మూడవ రోజైన శుక్రవారం నలుగురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఈ ఏడాది కాలంలో సాధించిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు.ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.పలమనేరు మున్సిపాలిటీ 15వ వార్డులో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పర్యటించగా చిత్తూరు నగరంలోని 7,8,9,10 డివిజన్ల పరిధిలో ఎమ్మెల్యే జగన్మోహన్ పర్యటించారు.నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నింద్రలో, ఎమ్మెల్యే మురళీమోహన్ పూతలపట్టు మండలంలోని వావిల్‌తోట పంచాయతీలో పర్యటించారు. పుంగనూరు నియోజకవర్గ పరిధిలో టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పర్యటించారు.


దివ్యాంగుడికి సంక్షేమ పథకాలను గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

త్రిసభ్య కమిటీల్లో చోటుపై
ఆశల చిగురింత

- సింగిల్ విండోల పదవులపై ద్వితీయశ్రేణి నాయకుల నిరీక్షణ

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఆలంబనగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (సింగిల్ విండోల)కు త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది.ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జులుగా వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారుల పదవీకాలం గత సోమవారంతో ముగియగా, ఈ నెల 31వరకు పదవీకాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. దీంతో త్రిసభ్య కమిటీల్లో చోటు దక్కించుకోవడానికి ప్రయత్నిస్తున్న ద్వితీయశ్రేణి నాయకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 75 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలున్నాయి. జిల్లాలవారీగా చిత్తూరులో 37, తిరుపతిలో 23, అన్నమయ్యలో 15 సింగిల్ విండోలున్నాయి. వీటిలో ప్రస్తుతం పర్సన్ ఇన్‌చార్జులుగా ఇటీవల బదిలీపై వచ్చిన అసిస్టెంట్ రిజిస్ట్రార్లను, బ్రాంచ్ మేనేజర్లను, సర్కిల్ సూపర్వైజర్లను, సీనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించారు.వీరి పదవీకాలాన్ని ఈ నెలాఖరు దాకా ప్రభుత్వం పొడిగించింది.వీరి స్థానాల్లో త్రిసభ్య కమిటీల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ కమిటీలో ఛైర్మన్‌తో పాటు ముగ్గురిని డైరక్టర్లుగా నియమించేందుకు మూడునెలల క్రితమే ఆశావహుల పేర్లను తీసుకున్నారు. ఎమ్మెల్యేలే జాబితాలను సిద్ధం చేసి టీడీపీ అధిష్ఠానానికి పంపించారు. కొన్నిచోట్ల కూటమి నేతల మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో వాటిని పక్కన పెట్టేశారు.అయితే జూలై 15లోగా సంఘాలన్నిటికీ త్రిసభ్య కమిటీలు వేయనున్నట్లు సమాచారం. తర్వాత ఎన్నికలు నిర్వహించినా



అప్పుడు కూడా వీరినే అధ్యక్షులుగా కొనసాగించేలా అభ్యర్థులను ఎంపిక చేయాలని టీడీపీ అధిష్ఠానం జిల్లా నేతలకు సూచించినట్లు తెలిసింది. తేడాలుంటే ఇప్పుడే సరిదిద్ది, మరోసారి జాబితాను పునః పరిశీలించాలని చెప్పడంతో ఆ మేరకు వడపోత కూడా జరిగింది.75 సింగిల్ విండోలకు నియమించే త్రిసభ్య కమిటీల సభ్యులకు చెందిన 19 అంశాలతో కూడిన సమాచారాన్ని సహకారశాఖ సేకరిస్తోంది. సభ్యులకు సొసైటీలో సభ్యత్వం ఉందా?, రుణాలు, వ్యవసాయ భూములున్నాయా? వారిపై ఏదైనా కేసులున్నాయా? వంటి 19 అంశాలతో కూడిన వివరాలను సేకరిస్తున్నారు. ఇదిలా జరుగుతుండగానే త్రిసభ్య కమిటీలకు ప్రతిపాదించిన సభ్యుల పేర్లు బయటకు వెల్లడి కావడంతో ఇక వారే నియమితులవుతారంటూ గ్రామాల్లో ప్రచారాలు ప్రారంభమయ్యాయి.చాలాచోట్ల వారికి పదవులొచ్చేశాయంటూ సన్మానాలు చేయడం కూడా ప్రారంభించారు.

కాంపౌండర్ టు కార్డియాలజిస్ట్!

చిత్తూరులో ఐదేళ్లుగా
రెండు, మూడు ఆస్పత్రుల్లో నకిలీ డాక్టర్ విధులు
యూట్యూబ్‌లో విడియోతో బయటపడ్డ బాగోతం

చిత్తూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి):చిత్తూరులో ఐదేళ్లుగా కార్డియాలజిస్ట్‌గా పని చేస్తున్న ఓ నకిలీ డాక్టర్ బాగోతం బయటపడింది.గుంటూరు జిల్లా చెరుకుపల్లెకు చెందిన వీరాంజనేయులు పదేళ్ల క్రితం ఆర్ఎంపీగా ప్రాక్టీస్ చేశాడు.కొంతకాలమయ్యాక గుంటూరులోని కొన్ని ఆస్పత్రుల్లో కాంపౌండర్‌గా పనిచేశాడు.ఆ తర్వాత డాక్టర్‌గా అవతారం ఎత్తి పలు పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఆ విషయం బయటకు పొక్కి కేసులు నమోదు కావడంతో చిత్తూరుకు మకాం మార్చాడు.డాక్టర్ రమేష్‌బాబుగా పేరు మార్చుకుని నగరంలోని ఏకే అమ్మా ఆస్పత్రిలో కార్డియాలజిస్ట్‌గా చేరిపోయాడు.కొన్ని సంవత్సరాల తరువాత మేనేజ్మెంట్‌తో తలెత్తిన విభేదాల కారణంగా రెండేళ్ల క్రితం సంతపేటలో ఉన్న లైఫ్‌లైన్ ఆస్పత్రిలో చేరాడు.ఏడేళ్ల క్రితం పెళ్లాడిన మహిళ అదనపు కట్నం కోసం వేధించడంతో పుట్టింటికి వెళ్లిపోయింది. ఇతడిపై అనుమానం వచ్చి విచారించగా అసలు డాక్టరే కాదని, ఎంతోమంది మహిళలను పెళ్లిపేరుతో మోసం చేశాడని తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో గుంటూరులో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదంతా ఓ టీవీ ఛానల్‌లో కథనంగా ప్రసారమైంది. యూట్యూబ్‌లో ఉన్న ఈ కథనం వీడియో చిత్తూరులో శుక్రవారం పలు వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేసింది. కార్డియాలజిస్ట్‌నంటూ వచ్చిన వ్యక్తి సర్టిఫికెట్లు పరిశీలించకుండా,వివరాలు తెలుసుకోకుండా ఆస్పత్రుల్లో ఎలా ఉద్యోగం ఇచ్చారో వైద్యాధికారులకు కూడా అంతుచిక్కని ప్రశ్నగా మిగిలింది. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో సుధారాణి తెలిపారు.

65,451 బంగారు కుటుంబాల గుర్తింపు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమంలో లక్ష్యాలను ఈనెల 15వ తేదీలోగా అన్ని జిల్లాలు అందుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. శుక్రవారం అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక ఎమ్మెల్యేలతో పీ-4 పురోగతిపై దిశానిర్దేశం చేశారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సుమిత్ కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు. సుమిత్ కుమార్ జిల్లాలో పురోగతిని సీఎంకు వివరిస్తూ.. 65,451 బంగారు కుటుంబాలను పీ-4 కార్యక్రమం కింద గుర్తించినట్లు చెప్పారు. వీటిలో మెజార్టీ కుటుంబాలను పలువురు దత్తత తీసుకున్నారని, మరికొన్ని కుటుంబాల దత్తత కోసం ఆసక్తి కల్గినవారి కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. నియోజకవర్గాలవారీగా చిత్తూరులో 7953, గంగాధరనెల్లూరులో 11,573, కుప్పంలో 10,407, నగరిలో 5,135, పలమనేరులో 10,106, పుంగనూరులో 9,541, పూతలపట్టులో 10,736 కుటుంబాల దత్తత జరుగుతున్నదని వివరించారు. సీపీవో శ్రీనివాసులు, ఏడీ సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరు రెవెన్యూ అధికారులపై చర్యలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు కలెక్టరేట్‌లోని లీగల్ సెల్ సూపరింటెండెంట్ షబ్బీర్ బాషా అలియాస్ షబ్బార్ బాషాపై ఆర్టికల్ ఆఫ్ ఛార్జెస్ నమోదు చేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. షబ్బీర్ బాషాపై గతంలో నమోదైన అభియోగాలకు సంబంధించి శుక్రవారం జీవో (నెం. 688, 689, 690)లను ప్రభుత్వం జారీచేసింది.షబ్బీర్ బాషా 2023లో శ్రీరంగరాజపురం తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు.మార్చి 21న ఓ రైతు నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను నియమిస్తున్నట్లు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. ఏసీబీ కేసులో పట్టుబడ్డ షబ్బీర్ బాషాపై ఛార్జెస్ నమోదుచేయడంపై 10 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తన అభిప్రాయాలను అందజేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇదే కేసులో అప్పట్లో ఏసీబీకి చిక్కిన తయ్యూరు వీఆర్వో గోవిందరెడ్డిపై కూడా చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది.

విద్యుత్ శాఖకు
రూ.76లక్షల ఆదాయం

'అదనపు లోడు' క్రమబద్ధీకరణతో వచ్చిందన్న అధికారులు
సద్వినియోగం చేసుకున్న 3,780 మంది వినియోగదారులు

చిత్తూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ కనెక్షన్ ఉన్నవారు అదనపు లోడు క్రమబద్ధీకరణ చేసుకోవడానికి డెవలప్‌మెంట్ చార్జీలో ప్రభుత్వం 50 శాతం రాయితీని ఇచ్చింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి జూన్ 30వ తేదీవరకు అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని 3,780 మంది వినియోగదారులు సద్వినియోగం చేసుకున్నారు. దీంతో విద్యుత్‌శాఖకు రూ.76,63,650 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

రాయితీ ఇచ్చిందిలా..

ఉదాహరణకు ఒక కిలోవాట్ లోడుతో కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ.200, డెవలప్‌మెంట్ చార్జీ రూ.2వేలు, దరఖాస్తుకు రూ.50 కలిపి రూ.2250 చెల్లించాలి. ప్రభుత్వం డెవలప్‌మెంట్ చార్జీలో రాయితీ ఇవ్వడంతో రూ.2వేలకు బదులు రూ.వెయ్యి మాత్రమే వసూలు చేశారు.

అదనపు లోడు ఎందుకంటే..

గృహాలకు విద్యుత్ కనెక్షన్ తీసుకునేటప్పుడు గృహోపకరణాల వినియోగాన్ని అంచనా వేసి లోడును కిలోవాట్లలో లెక్కించి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు చెల్లిస్తారు. అధిక శాతం మంది రెండు లేదా మూడు కిలోవాట్లకు అనుమతి తీసుకుంటారు. ఈ లెక్క ప్రకారమే అధికారులు ఆ ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తారు. తర్వాత గృహ యజమానులు ఏసీ, ఫ్రిజ్, వాషింగ్‌మిషన్, గీజర్లు వంటివి ఏర్పాటు చేసుకున్నా.. అందుకు అనుగుణంగా అదనపు లోడు పడుతుంది. అయితే అందుకు చార్జీలను చెల్లించరు. దీనివల్ల ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడు ఎక్కువై తరచూ ట్రిప్ కావడంతోపాటు లోఓల్టేజీ సమస్యలు వస్తున్నాయి.



విద్యుత్ సర్వీసులు

అదనపు లోడ్ క్రమబద్ధీకరణ వివరాలు

డివిజన్	సర్వీసులు	ఆదాయం
చిత్తూరు	2245	44,11,150
చిత్తూరు రూరల్	551	11,57,400
పుంగనూరు	984	16,95,100
మొత్తం	3780	72,63,650

జరిమానా తప్పదు

లోఓల్టేజీ సమస్య ఉన్న ప్రాంతాల్లోని ఇంటింటినీ విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ చేస్తారు. వారు తీసుకున్న లోడు ఆధారంగా గృహోపకరణాలు వినియోగిస్తున్నారా? లేదా? అని పరిశీలిస్తారు. అదనపు లోడు వినియోగిస్తున్నట్లు తేలితే లోడుకు అనుగుణంగా జరిమానా విధిస్తారు.



విశేష స్పందన

అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ కల్పించడంతో వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. జిల్లాలో 3,780 మంది సద్వినియోగం చేసుకున్నారు. దీనికి అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, అదనపు లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.
- ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ

సచివాలయ ఉద్యోగి చేతివాటం

ఏసీబీ జ్యూస్ ఫ్యాక్టరీలో నకిలీ టోకెన్ల కలకలం

వెదురుకుప్పం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకున్న ఓ సచివాలయ ఉద్యోగి నకిలీ టోకెన్లతో మోసగించిన ఘటన శుక్రవారం కార్వేటినగరం మండలంలో వెలుగుచూసింది.డీఎం పురం సచివాలయంలో హార్టికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వెంకటేష్‌కు కార్వేటినగరం మండలం అన్నూరు వద్ద వున్న ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద డ్యూటీ వేశారు.ఫ్యాక్టరీ యాజమాన్యంతో పాటు మామిడి కాయలు తోలుకొచ్చే రైతులకు సహకారం అందించే విధులు ఆయనవి.రైతుల రద్దీని తట్టుకోలేక చాలా ఫ్యాక్టరీల వద్ద టోకెన్ సిస్టం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.మామిడి రైతులకు అవసరమైన టోకెన్ల డిమాండ్‌ను గుర్తించిన వెంకటేష్ పుత్తూరులో నకిలీ టోకెన్ల బుక్, ఏబీసీ ఫ్యాక్టరీ అధికారి సీలు తయారు చేయించాడు. ఆ అధికారి సంతకం ఫోర్జరీ చేసి రైతులకు టోకెన్లను రూ.వెయ్యి చొప్పున విక్రయించాడు.నకిలీ టోకెన్లను మొదట ఫ్యాక్టరీ సిబ్బంది గుర్తించలేదు.గురువారం తాము ఇచ్చిన టోకెన్లకన్నా ట్రాక్టర్లు ఎక్కువగా ఉండడం గమనించిన యాజమాన్యం ప్రత్యేక నిఘా ఉంచితే నకిలీ టోకెన్లతో వచ్చిన 20 ట్రాక్టర్లు మామిడి కాయలను అన్‌లోడ్ చేసినట్లు గుర్తించారు.ఇంకా నకిలీ టోకెన్లతో వచ్చిన ట్రాక్టర్లు ఫ్యాక్టరీ ఆవరణంలో వున్నట్లు కూడా గుర్తించారు.వాటిని శుక్రవారం అన్‌లోడ్ చేయకుండా కార్వేటినగరం పోలీసులకు ఫ్యాక్టరీ మేనేజరు వెంకటేష్ ఫిర్యాదు చేశారు.సీఐ ఎస్.హనుమంతప్ప ఫ్యాక్టరీ వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు.34 నకిలీ టోకెన్లను సీజ్ చేసి సచివాలయ ఉద్యోగి వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు.ఇంకా ఈ నకిలీ టోకెన్ల వ్యవహారంలో ఎవరెవరి పాత్ర ఉందో పోలీసు దర్యాప్తులో తేలనుంది.


నకిలీ టోకెన్ల కలకలంతో ఫ్యాక్టరీ వద్ద అన్‌లోడ్ కాకుండా ఆగిన ట్రాక్టర్లు


ABC FRUITS UNIT-4
VEHICLE TOKEN
S.No. 591
Issued Date :
Alloted Date : 26/6/25
Farmer Name : B. [illegible]
Village : K. Nagar
Mandal :
Farmer Aadhar No. :
Farmer PH No. :
Security Seal :
Authorised Sig.

నకిలీ టోకెన్

అత్యాచారం కేసులో
20 ఏళ్ల జైలు


నిందితుడు రామకృష్ణ

చిత్తూరు లీగల్/సోమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికి చిత్తూరు పోక్సో న్యాయస్థానం 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది.సోమల మండలం చింతలవారిపల్లెకు చెందిన రామకృష్ణ (46) 2020 జూలై 20వ తేదిన ఓ చిన్నారి స్నేహితులతో ఆడుకుంటుండగా చాక్లెట్ కొనిపెడతానంటూ మాయమాటలు చెప్పి ఓ పాడుబడిన ఇంట్లోకి తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు.ఆ చిన్నారి ఏడుస్తూ ఇంటికెళ్ళగా విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చిత్తూరు మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బాబూప్రసాద్ దర్యాప్తు చేపట్టి నాలుగురోజుల తరువాత ముద్దాయిని ఎస్.నడింపల్లె వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.ఈ కేసు శుక్రవారం చిత్తూరు పోక్సో కోర్టులో విచారణకు రాగా, పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శంకరరావు నిందితుడు రామకృష్ణకు 20 ఏళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసును ఏపీపీ మోహనకుమారి వాదించారు.ముద్దాయికి శిక్ష పడేలా చేసిన పలమనేరు డీఎస్పీ ప్రభాకర్, చౌడేపల్లె సీఐ రాంభూపాల్, సోమల పోలీసులను ఎస్పీ మణికంఠ అభినందించారని సోమల ఎస్ఐ శివశంకర తెలిపారు.

రాయితీపై ఆధునిక వ్యవసాయ పరికరాలు



రైతు సంఘం సభ్యులకు డ్రోన్‌ను అందిస్తున్న నేతలు

రామకుప్పం, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాయితీపై ఆధునిక వ్యవసాయ పరికరాలు అందిస్తోందని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి అన్నారు. రామకుప్పం మండలం బిరుగుండ్లపల్లె గ్రామానికి చెందిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి రైతు సంక్షేమ సంఘానికి ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో అందించిన రూ.9.80 లక్షలు విలువైన ఎరువుల పిచికారి డ్రోన్‌ను శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీకాంత్, వ్యవసాయాధికారి అమృత, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కారదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు



పార్టీలో చేరిన గుడుపల్లె మండల వాసులతో పీఎస్ఎం తదితరులు

కుప్పం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటన సందర్భంగా వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరిగాయి. గుడుపల్లె మండలం తిమ్మనాయనిపల్లె గ్రామానికి చెందిన వెంకేశ్, సోడిగానిపల్లె గ్రామానికి చెందిన హరికృష్ణ వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించిన కార్యకర్తల సమావేశం అనంతరం వీరిని అదే వేదికపై ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్డీ సురేశ్‌బాబు, గుడుపల్లె మండల పార్టీ అధ్యక్షుడు టీఎం.బాబు నాయుడు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు, బేటప్పనాయుడు, హేమాంబర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ప్రభుత్వ సాయం



సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న నేతలు

శాంతిపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని మండల టీడీపీ అధ్యక్షులు బాష్యం విశ్వనాథ నాయుడు, ఎాజీ ఎంపీపీ నందిగం ఉదయ్‌కుమార్ నాయుడు అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో సీఎం సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకొన్న నలుగురు బాధితులకు నాయకులు చెక్కులను పంపిణీ చేశారు. మఠానికి చెందిన దేవమ్మకు రూ.4,26,735, కెనమాకులపల్లె మురళీ రూ.1,34,460, చిలామాకులరాయికి చెందిన హేమావతికి రూ.84,463, 64-పెద్దూరుకు చెందిన స్వాతికి రూ.1,00983 చెక్కులను అందుకున్నారు. నేతలు విజయరామి రెడ్డి చంద్రశేఖర్, జయారెడ్డి, హరినాథ రెడ్డి, పాల శివ, పెద్దన్న, జయపాల్, రమేష్, ఈడిగ శివశంకర్, ఆనంద్ నాయుడు, బీరేష్ గౌడు, మునిరెడ్డి, నాగరాజు, రాజేంద్ర పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ

పలమనేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న శనివారం పలమనేరు కోర్టు ఆవరణలో జరిగే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని కేసులను పరిష్కరించుకోవాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన పలమనేరులో విలేకర్లతో మాట్లాడుతూ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న పరిష్కరించబడని సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, బ్యాంకు, టెలికాం, మున్సిపల్‌శాఖలకు సంబంధించిన కేసులను రాజీ చేసుకొని పరిష్కరించు కోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేనివి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు సేవలు మరువలేనివని పుంగనూరు బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో అల్లూరి సీతారామరాజు చిత్రపటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, సుబ్రహ్మణ్యంరాజు, భక్తవత్సలరాజు, రెడ్డెప్పరాజు, సోమరాజు, నారాయణరాజు పాల్గొన్నారు.

● **రామకుప్పం:** పీఎంకేతాండాలో గిరిజనులు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మోహన్‌నాయక్, రత్నమ్మ, అమ్మియమ్మ, నానికమ్మ, నీలమ్మ, కాళమ్మ, శాంతిలమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

సదరం సర్టిఫికెట్లకు దరఖాస్తు చేసుకోండి

సోమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగులు సెప్టెంబరు 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. మీసేవ, సచివాలయాల్లో ఇందుకోసం పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డుపైనే మురుగు నీరు..!



వివేకానంద కాలనీలో రోడ్డుపైకి వస్తున్న మురుగునీరు

పుంగనూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాలువలో నిల్వ ఉన్న మురుగునీరు రోడ్డుపైకి వస్తున్నాయని.. దోమల కారణంగా స్థానికులు అవస్థలు పడుతున్నారని పుంగనూరు మినీ బైపాస్‌రోడ్డులోని వివేకానందకాలనీ రెండో వీధి ప్రజలు వాపోతున్నారు. శుక్రవారం మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో స్థానికులు నడిచేందుకు ఇబ్బందులు పడ్డారు. కొద్ది పాటి వర్షానికి కాలువ నిండి వీధుల్లో ప్రవహించడంతో దుర్వాసనకు ఇళ్లల్లో ఉండలేకపోతున్నట్లు వాపోయారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాల్వల్లో నిల్వ ఉన్న మురుగునీరు తొలగించి రోగాల బారి నుంచి కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే నియోజకవర్గ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అధికారులు, నాయకుల సమన్వయ కృషితోనే నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమవుతుందని.. అభివృద్ధి ప్రణాళికలు భవిష్యత్ తరాలకు వరంగా నిలవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధి చెందేలా అధికారులు కృషి చేయాలన్నారు. పలమనేరు వ్యవసాయంతో ముడిపడిన ప్రాంతమని.. ఇక్కడి అనుకూలతలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. పాడి పరిశ్రమ, ఫుడ్ ప్రాసెసింగ్‌లకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన ప్రాంతమని తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్డీవో భవాని, మున్సిపల్ కమిషనర్ ఎన్‌వీ రమణారెడ్డి, నియోజకవర్గంలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు



అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, జూలై 4 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు రాహుకాలంలో అమ్మవారికి ప్రత్యేకంగా పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల అన్నదానం కార్యక్రమాన్ని ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

ముగిసిన వారాహిదేవి నవరాత్రులు



చౌడేపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవి ఆలయంలో వారాహిదేవి నవరాత్రులు శుక్రవారం ముగిశాయి. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నవధాన్యాల అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం ప్రత్యేకంగా నవధాన్యాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. మహిళలు ఉపవాసాలతో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి



ఉర్దూ పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

రొంపిచెర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని చిత్తూరు డీవైఈవో ఇందిర అన్నారు. శుక్రవారం రొంపిచెర్ల ఉర్దూ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం సుజాత, సర్పంచ్ ఇబ్రహీం ఖాన్, ఉపాధ్యాయులు అక్బర్‌బాషా, శ్రీనివాసులు, రసూల్ ఖాన్ పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత



పెద్దఉప్పరపల్లెలో డెంగ్యూపై అవగాహన ర్యాలీ

సోమల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పరిసరాల శుభ్రత అందరి బాధ్యతని.. దోమల నియంత్రణకు ప్రజలు సహకరించాలని పెద్దఉప్పరపల్లె వైద్యాధికారి డాక్టర్ బాలాజీ అన్నారు. శుక్రవారం పెద్దఉప్పరపల్లెలో వైద్యసిబ్బంది, విద్యార్థులు డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణాధికారి ఉదయభాస్కర్ మాట్లాడుతూ దోమల కారణంగా వచ్చే వ్యాధులు, దోమల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం లోకేశ్వరమ్మ, సురేంద్రరెడ్డి, చంద్రమ్మ, హేమ, శోభ, అమరావతి, మహబూబ్ జాన్, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షం



రొంపిచెర్లలో చల్లా రామచంద్రారెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

రొంపిచెర్ల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చంద్రబాబు పాలనతోనే ప్రజలు సుభిక్షంగా ఉన్నారని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లె, నగిరిహరిజనవాడ, గుట్టకింద హరిజనవాడల్లో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కురబ కార్పోరేషన్ డైరెక్టరు ఉయ్యాల రమణ, ఎంపీటీసీ సంపూర్ణమ్మ, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు సహదేవ, సింగిల్‌విండో డైరెక్టర్లు సురేంద్ర, నాయకులు వెంకట్రమణ, శివారెడ్డి, సర్పంచ్ ఇబ్రహీంఖాన్, మాజీ సర్పంచులు రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డి, నాయకులు ఎస్.కరీముల్లా, కొండా మురళీ, అమరనాధరెడ్డి, నాగరాజ, శ్రీపతి, మస్తాన్, చంద్రశేఖర్‌నాయుడు, ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** పలమనేరు మున్సిపాలిటీలోని 15వ వార్డులో శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఆర్వీ బాలాజీ, ఆర్బీసీ కుట్టి, సుబ్రహ్మణ్యం గౌడు, నాగరాజు, ఖాజా, బీఆర్సీకుమార్, కిరన్, రూపేష్, సుదర్శన్, బాలాజీ, సురేష్‌లతో పాటు జనసేన నాయకులు దిలీప్, హరీష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె:** కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెడుతోందని టీడీపీ నాయకులు మాదిరాజు లక్ష్మీపతిరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన దిగువపల్లె పంచాయతీలోని పక్షిరాజపురం, మాదవంవారిపల్లె, కాటిపేరి, చిన్న కొండామారి గ్రామాల్లో ఇంటింటికీ పర్యటించి కరపత్రాలను అందించారు. టీడీపీ నాయకులు హరిప్రసాద్, బోయకొండ రామకృష్ణ, శివకుమార్, కార్తిక్, చారాల మంజు, గణేష్, ఆది, గంగాధర్, కుమార్‌రెడ్డి, మునిరత్నం, నాగరాజరెడ్డి, కిశోర్, ప్రహ్లద్, తదితరులు పాల్గొన్నారు.

● **సోమల:** సీఎం చంద్రబాబుపాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని సోమల టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. శుక్రవారం కందూరులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు పి.శ్రీనివాసులు, కె. శ్రీనివాసులు, నౌషాద్, సుబ్బరాయులు, హరిప్రసాద్, శంకర్, సతీశ్, బాలకృష్ణమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

● **పుంగనూరు:** పుంగనూరు పట్టణంలోని పలుచోట్ల శుక్రవారం సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రాలను అందిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు ఎం.శ్రీకాంత్, సీవీరెడ్డి, ఎస్. సుహేల్‌బాషా, అబ్బాస్, కిరణ్, మధు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు



కుప్పంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న పీఎస్ఎం తదితరులు

కుప్పం, జులై 4 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్డీ.సురేశ్ కుమార్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. కుప్పం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో శుక్రవారం నూతనంగా మంజూరైన 375 పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు నరేశ్, తులసీనాథ్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, క్లస్టర్ ఇన్‌చార్జి కన్నన్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● **కుప్పం రూరల్‌లో:** కుప్పం మండలం మోట్లచేను గ్రామంలో టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మండలంలోని కృష్ణదాసనపల్లె పంచాయతీలో ఐటీడీపీ ఉపాధ్యక్షుడు ఈఆర్పీ బాలాజీ ఆధ్వర్యంలో పింఛన్లను అందించారు.

● **రామకుప్పం:** రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని పేదరికం నుంచి విముక్తి కల్పించడమే సీఎం చంద్రబాబు ధ్యేయమని రామకుప్పం ఎంపీపీ సులోచన, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు తెలిపారు. శుక్రవారం మండలంలో కొత్తగా మంజూరైన 660 మంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కారదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

● **గుడుపల్లె :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నేతలు బాబు నాయుడు, చంద్రశేఖర్, హేమాంబర్ గౌడ్, అమీర్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బస్టాండులో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దారు సీతారామ్, ఎంపీడీవో రాధాకృష్ణ, నేతలు బేటప్ప నాయుడు, వెంకటేష్, బాలాజీ, బాబు, రామచంద్ర, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బాటగంగమ్మ ఆలయంలో చోరీ

బైరెడ్డిపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని దుండగులు ఆలయం తలుపుతాళాలు పగులగొట్టి అమ్మవారికి అలంకరించిన దాదాపు 20 గ్రాముల బంగారు నగలను చోరీ చేసుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కోదండ రామాలయ బ్రహ్మోత్సవాలు

తవణంపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరులోని కోదండరామాలయంలో శనివారం ఈనెల 19వ తేదీవరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, మహాద్వార పూజ, సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నట్లు వివరించారు.

36 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 36 మందికి జడ్జి జరిమానా విధించారని ఒకటో పట్టణ సీఐ మహేశ్వర తెలిపారు. రెండ్రోజులుగా మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 30 మందిపై కేసు నమోదు చేశారు. వీరందరినీ శుక్రవారం రెండో తరగతి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించారని సీఐ వివరించారు.

10న పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్రాయ కొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 10న పౌర్ణమి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే గిరింపేట సత్యసాయి సంస్థాన్ సత్యసాయి బాబాకు పౌర్ణమి పల్లకి సేవను భక్తులు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు తెలిపారు.

గంగవరం మండల సమావేశం వాయిదా



మండల సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో తిరుమల గోపాల ప్రసాద్

గంగవరం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కోరం లేక గంగవరం మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలు శాఖల అధికారులు హాజరైనా ఎంపీపీతో పాటు పలువురు సభ్యులు సమావేశానికి హాజరుకాలేదు. జడ్పీటీసీతో పాటు ముగ్గురు ఎంపీటీసీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం లేక సమావేశాన్ని రద్దు చేస్తున్నామని, 5వ తేదీ శనివారం మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం జరుగనుందని డిప్యూటీ ఎంపీడీవో తిరుమల గోపాలప్రసాద్ ప్రకటించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

పుంగనూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి బలరామమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పుంగనూరు ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీ సిబ్బందితోనే నడపాలని, డీఏ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన 12వ పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగుల సంఘ నాయకులు జేఆర్ఎన్ రెడ్డి, గంగాధర్, జీవీ రమణ, జీఎన్ రెడ్డి, బావాజాన్, అన్వర్, మురళీమోహన్, పీపీ సాహెబ్, జీఎంఖాన్, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి తగాదా కేసులో ముద్దాయిలకు రిమాండు

పుంగనూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదా కేసులోని ముద్దాయిలకు న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు శుక్రవారం పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ఆయన కథనం మేరకు... మండలంలోని రాగానిపల్లె పంచాయతీ అడవినాథునికుంటకు చెందిన రత్నారెడ్డి కుమారుడు మహేంద్రరెడ్డి, అదే గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు లోకేశ్‌ల మధ్య గత కొంత కాలంగా ఆస్తి గొడవలు ఉన్నాయి. మహేంద్రరెడ్డి ఫిర్యాదుతో లోకేశ్, మోహన్‌కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, సుదర్శన్‌లపై కేసు నమోదు చేశారు. మోహన్‌కృష్ణారెడ్డి, కృష్ణారెడ్డిలను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు. అలాగే లోకేశ్ భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు మహేంద్రరెడ్డితోపాటు మహేశ్‌బాబు, ఓ మైనర్ బాలుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించారు.

బాటగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బైరెడ్డిపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లెలోని బాటగంగమ్మ ఆలయంలో చోరీ జరగడంతో శుక్రవారం ఆలయ శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు తిప్పయాచార్యులు, నాగేంద్ర శాస్త్రోక్తంగా హోమం, అమ్మవారికి అభిషేకం చేసి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): యువత అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో రాణించాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఆయన మాట్లాడారు. పలమనేరు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ప్రాంతమన్నారు. ఇక్కడ పరిశ్రమలు వచ్చేందుకు అవకాశం ఉందని.. యువత సాంకేతిక విద్యపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. మేళాలో సుమారు 489 మంది హాజరు కాగా.. 178 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎం. గుణశేఖర్‌రెడ్డి, ఏపీఎస్ఎస్ డీసీ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, సీడప్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి లోకేష్, ఏపీఎస్ఎస్‌డీసీ ఎస్టీవో పవన్ కుమార్, ఏడీ ఎస్‌డీవె ఎం.ఏకాంబరం, హెచ్‌ఆర్, ఎంఐఎస్ వేణు, స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ రసూల్, సిసింద్రీ, రాజా, సుబ్రహ్మణ్యం, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు ఏమి నష్టం జరిగిందని వస్తున్నావ్?



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తిరుపతి (ఎమ్మార్‌పల్లె), జూలై 4 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతాంగానికి ఏం నష్టం జరిగిందని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళ్యానికి వస్తున్నారో చెప్పాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మామిడి గుజ్జు పరిశ్రమలను సిండికేట్‌గా మార్చి తోతాపురి రైతుల నుంచి తక్కువ ధరకు పంట కొనుగోలు చేసేందుకు వైసీపీ నేతలు కుట్ర చేస్తున్నారన్నారు. ఈ కుట్రకు మద్దతు ఇచ్చేందుకే వైసీపీ అధినేత వస్తున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ నేత ప్రకాశ్‌రెడ్డికి చెందిన సీజీఆర్ ఫుడ్స్ కూడా రైతుల నుంచి కిలో రూ.3కే కొంటున్న విషయం వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. తోతాపురి మామిడిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకంటే తక్కువకు కొనుగోలు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులను రోడ్డున పడేస్తున్న వైసీపీ మాఫియాకు అండగా నిలబడేందుకు జగన్‌రెడ్డి పర్యటిస్తున్నారని విమర్శించారు.

రేపు పశువైద్యశాలల్లో శునకాలకు ఉచిత టీకాలు

చిత్తూరు సెంట్రల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువుల నుంచి మనిషికి వ్యాధులు సంక్రమించకుండా అవగాహన కల్పించడానికి ఏటా జూలై ఆరో తేదీన జూనోసిస్ డే నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ ఆరిఫ్ శుక్రవారం తెలిపారు. జంతువుల నుంచి మనిషికి సోకే అంటువ్యాధుల నివారణకు జూనోటిక్ వ్యాధైన రేబిస్ వైరస్ నుంచి విముక్తి పొందడానికి ఫ్రెంచ్ జీవ శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ కనుగొన్న వ్యాక్సిన్ 1885 జూలై 6వ తేదీన విజయవంతం అయ్యిందన్నారు. దీంతో ఏటా ఆ రోజును పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు పశువైద్యశాలల్లో జూనోసిస్ డేగా నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. శనివారం పశువైద్యశాలల్లో నిర్వహించే ఈ కార్యక్రమంలో పెంపుడు శునకాలకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు ఆరిఫ్ తెలిపారు. వ్యాక్సిన్‌కు జిల్లాలో ఎలాంటి కొరత లేదన్నారు. పెంపుడు శునకాలకు టీకాలు వేయించుకోవాలని సూచించారు.

ట్రాక్టర్‌కు రూ.20 నుంచి రూ.500 వసూలు

ఎస్‌ఐకి ఫిర్యాదు చేసిన మామిడి రైతులు



ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న రైతులు

గుడిపాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మామిడి కాయలను అన్‌లోడ్ చేయడానికి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ఫ్యాక్టరీ సిబ్బంది ఒక్కో ట్రాక్టర్‌కు రూ.20 నుంచి రూ.500 వసూలు చేస్తున్నారని శుక్రవారం ఎస్‌ఐ రామ్మోహన్‌కు మామిడి రైతులు ఫిర్యాదు చేశారు. రైతులు మాటల్లోనే.. 'తాసా ఫ్యాక్టరీ సిబ్బంది ట్రాక్టర్‌కు రూ.20 తీసుకోవడమే కాకుండా.. వారికి అవసరమైన కాయలను తీసుకుని.. మిగిలినవాటిని వెనక్కు పంపుతున్నారు. ఫుడ్ అండ్ ఇన్స్ ఫ్యాక్టరీ సిబ్బంది అయితే ట్రాక్టర్‌కు రూ.500 ఇస్తే ముందుగా పంపుతున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ యజమానులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని రైతులకు ఎస్‌ఐ హామీ ఇచ్చారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో ట్రాక్టర్లు వస్తుండటంతో అన్‌లోడింగుకు సమయం పడుతోందని తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● ఆర్టీసీ టూడిపో ఎదుట ఈయూ ధర్నా



రెండో డిపో వద్ద ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వ పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) నాయకులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం చిత్తూరు ఆర్టీసీ టూడిపో ఎదుట ఈ మేరకు ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమై ఆరేళ్లవుతున్నా ఉద్యోగుల పదోన్నతులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. పదోన్నతులు వస్తాయని ఎదురుచుస్తూనే ఏడాదికి రెండువేల మంది రిటైర్ అయిపోతున్నారని వాపోయారు. సీఎం చంద్రబాబు స్పందించి.. ప్రస్తుతం అర్హులైన 3వేల మందికి న్యాయం చేయాలని కోరారు. ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటనెన్స్ సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీనుంచి ప్రవేశపెట్టనున్న మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ఈయూ స్వాగతిస్తుందని చెప్పారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి మురళీధరన్, డిపో అధ్యక్షుడు చలపతి, కార్యదర్శి సుబ్రమణి, నాయకులు పార్థీబన్, ప్రసాద్, చక్రవర్తి, అన్ను, సతీష్, బాష తదితరులు పాల్గొన్నారు.

బుద్ధుడి విగ్రహ ధ్వంసంపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవో భవానికి వినతిపత్రం అందజేస్తున్న బాస్ ప్రతినిధులు

పలమనేరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లి రూరల్ మండలం అంకిశెట్టిపల్లి సమీపంలో బుద్ధుడి విగ్రహం తలను తొలగించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం పలమనేరు ఆర్డీవో భవానికి బాస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంకిశెట్టిపల్లి సమీపంలోని కొండపై ఆధ్యాత్మిక చైతన్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఇప్పటికే రూ.2 కోట్లకు పైగా ఖర్చుచేసి అభివృద్ధి చేశామన్నారు. గతంలో గౌతమ బుద్ధుడి మూడు విగ్రహాలు, సీసీ కెమెరాలను ధ్వంసం చేశారని.. ప్రస్తుతం నాలుగోసారి విగ్రహం తలను ధ్వంసం చేశారని వాపోయారు. అధికారులు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసి దుండగులను శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సేన రాష్ట్ర అధ్యక్షులు గణపతి, ఉపాధ్యక్షులు దొరస్వామి, నేతలు వినోద్‌కుమార్, సురేష్, అనిల్, శ్రీనివాసులు, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్ ఆత్మహత్య



దామోదరం (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వ్యాను డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండలం మోర్దానపల్లె పంచాయతీ సీఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన మునిరత్నం కుమారుడు దామోదరం(49) కోళ్ల వ్యాన్ నడుపుతూ జీవనం సాగించేవాడు. శుక్రవారం ఉదయం బంగారుపాళ్యం మండలంలోని మహాసముద్రం టోల్‌గేట్ వద్ద కొత్తపల్లెకు వెళ్లే రోడ్డు పక్కన కోళ్ల వ్యాన్‌ను ఆపాడు. ఆ వ్యానుకు ఉన్న దారంతో ఉరేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఏఎస్‌ఐ మల్లప్ప తెలిపారు.

రేపట్నుంచి శాస్త్రీయ నృత్య పోటీలు

చిత్తూరు కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రెవెన్యూ భవన్‌లో ఆదివారం నుంచి ప్రజాహిత సేవా సంస్థ, మాదిరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాస్త్రీయ నృత్య పోటీలు జరగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు రాజరత్నంరెడ్డి, విజయసింహారెడ్డి తెలిపారు. 6న ఉదయం 14 ఏళ్లలోపు వారు జూనియర్లుగా, సాయంత్రం 4 గంటల నుంచి 15 ఏళ్ల పైబడినవారు సీనియర్లుగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఒక్కో విభాగంలో గెలుపొందిన 10మంది విజేతలకు ఈనెల 13న ప్రీ ఫైనల్, 20న సెమీ ఫైనల్, 28న ఫైనల్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ.5,000, ద్వితీయ బహుమతిగా రూ.3500, తృతీయ బహుమతిగా రూ.2500, నాల్గవ బహుమతిగా రూ.1500, ఐదో బహుమతిగా రూ.1000 చొప్పున అందజేస్తామని వివరించారు. పూర్తి వివరాలకు 99082 74927, 90006 11234 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పాతపేటలో ఏనుగుల దాడులు

పంటలు, డ్రిప్ పైపులు ధ్వంసం ● ఆందోళనలో బాధిత రైతులు



గోగులమ్మవంక అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు





ఏనుగుల దాడిలో నేల కూలిన కొబ్బరిచెట్లు, ధ్వంసమైన డ్రిప్ పైపులు, ఫిల్టర్లను పరిశీలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

కల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాతపేట వద్ద గురువారం రాత్రి పంటలపై ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించాయి. దీంతో మామిడి, కొబ్బరి, అరటి తదితర పంటలకు అపార నష్టం కలిగింది. గడిచిన మూడు నెలలకాలంలో తూర్పు విభాగం అటవీ ప్రాంతానికి సమీపంలోని పాళెం, దేవళంపేట, కల్లూరు పంచాయతీల్లో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేయడంతో రైతాంగానికి తీరని నష్టం కలిగింది. 17 ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి పులిచెర్ల మండలాన్ని వీడి పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీలోకి ప్రవేశించడంతో మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పాకాల మండలం నుంచి పలమనేరు కౌండిన్య అడవిలోకి వెళ్లిపోతాయని.. ఇకపై పంటలు ధ్వంసం కావని రైతులు భావించారు. అయితే రెండురోజులు గడవకముందే పాకాల మండలం పదిపుట్లబైలు పంచాయతీ సమీపంలోని అడవి నుంచి పులిచెర్ల మండలంలోకి తిరిగి ప్రవేశించాయి. ముందుగా పాతపాళెం అడవి నుంచి గురువారం రాత్రి బయలుదేరిన 17 ఏనుగుల గుంపు పాతపేట వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని రైతు సురేష్‌కు చెందిన కొబ్బరి, మామిడి, నీటి పైపులు, గేటువాల్వులను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. రైతు మునిరాజకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసిన ఏనుగులు కొబ్బరిచెట్లను ధ్వంసం చేశాయి. రైతు నందగోపాల్‌కు చెందిన అరటి, కొబ్బరిచెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. రైతు నటరాజకు చెందిన కొబ్బరి, పశుగ్రాసం, నీటిపైపులను ధ్వంసం చేసిన ఏనుగులు బోరుమోటారును కదిలించాయి. రైతులు దొరస్వామి, ప్రతాప్, చంద్రశేఖర్, వెంకట్రమణకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను ఏనుగుల గుంపు విరిచేశాయి. రైతు శ్రీనివాసులుకు చెందిన కొబ్బరిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ఏనుగుల గుంపు దాడిలో సుమారు 20 ఏళ్ల కొబ్బరిచెట్లు, మామిడిచెట్లు ధ్వంసం కావడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. పంటలను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు వచ్చిన దారిలోనే అడవిలోకి తిరిగి వెళ్లిపోయినట్లు బాధిత రైతులు తెలిపారు. శుక్రవారం పగలంతా గోగులమ్మవంక సమీపంలోని అటవీ ప్రాంతంలో 17 ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు స్థానికులు తెలిపారు. ధ్వంసమైన పంటలను అటవీశాఖ అధికారులు పరిశీలించారు.

చిత్తూరు ప్రభుత్వాస్పత్రిని పీపీపీ విధానంలోనే కొనసాగించాలి

● సీఎంకు ఏపీ ప్రభుత్వ నర్సుల సంఘం నేతల విజ్ఞప్తి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న రాణి

చిత్తూరు రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ (పీపీపీ) విధానంలోనే నడిపించాలని సీఎం చంద్రబాబును ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షురాలు రాణి కోరారు. కుప్పంలో సీఎం చంద్రబాబును గురువారం అసోసియేషన్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు. ఆ వివరాలను శుక్రవారం రాణి మీడియాకు వివరాలు తెలిపారు. 115 ఏళ్ల చరిత్ర ఉన్న చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిని అపోలో సంస్థకు 33 ఏళ్ల లీజుకు ఇచ్చారు. ఎంవోయూ ప్రకారం 320 బెడ్లకు సంబంధించిన వైద్య సిబ్బంది ఆస్పత్రిలో పనిచేయాలి. ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రిని అపోలో సంస్థకే పూర్తిగా అప్పగించి.. ప్రభుత్వ తరఫున వైద్య సిబ్బందిని తొలగిస్తారని అంటున్నారు. దీనికి ఇటీవల జరిగిన బదిలీల్లో ఆస్పత్రి నుంచి బయటకు వెళ్లడానికి ఆప్షన్ ఉంది కానీ.. లోపలికి రావడానికి ఖాళీలు చూపక పోవడం ఊతమిస్తోందని సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. అదే జరిగి రీ-డిప్లామేషన్ విధానంలో ప్రభుత్వ తరఫు వైద్యసిబ్బందని బదిలీ చేస్తే స్కూల్‌లో చేర్పించిన తమ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడతారని తెలిపారు. దీనిపై తమకు న్యాయం చేయాలని.. పీపీపీ విధానంలో ఆస్పత్రిని నడిపించాలని కోరామన్నారు. తనవెంట అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు శోభారాణి, జిల్లా కార్యదర్శి కలైవాణి, కోశాధికారి ఝాన్సీ లక్ష్మీబాయి, నాయకులు హిమబిందు తదితరులున్నారని తెలిపారు.

బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐతో లింకు చేసుకోండి

'తల్లికి వందనం'కు అర్హులైన తల్లులకు సూచన

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద అర్హులైన విద్యార్థుల తల్లులు తమ బ్యాంకు ఖాతాను ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో లింకు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి, సాధికారిత అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌ను లేదా పోస్టాఫీసు వారిని సంప్రదించాలని సూచించారు.

'అల్లూరి' కృషి మరువలేనిది : కలెక్టర్



అల్లూరి సీతారామరాజు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి అల్లూరి సీతారామరాజు చేసిన కృషి మరువలేనిదని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం పాత గ్రీవెన్స్ హాలులో అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమం జరిగింది. ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడల్, డీఆర్వో మోహన్‌కుమార్, సీపీవో శ్రీనివాసరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి రబ్బానీ బాషా, కలెక్టరేట్ ఏవో వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

సేవాతత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలి: ఎస్పీ



నివాళి అర్పిస్తున్న ఎస్పీ

పోలీసు వ్యవస్థలో పనిచేసే ప్రతి ఒక్కరూ అల్లూరి సేవా తత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ మణికంఠ సూచించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అల్లూరి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఎస్పీ రాజశేఖర్ రాజు, ఏఆర్ ఏఎస్పీ శివానంద కిశోర్, ఏఆర్ డీఎస్పీలు చిన్నికృష్ణ, మహబూబ్ బాషా, డీసీఆర్‌బీ సీఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొట్టేందుకే జగన్ పర్యటనలు

చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ విమర్శ



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూలై4 (ఆంధ్రజ్యోతి): ప్రజలను రెచ్చగొట్టేందుకే మాజీ సీఎం జగన్ పర్యటనలు చేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ విమర్శించారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రైతులను దగా చేసిన జగన్ ఇప్పుడు ఏముఖం పెట్టుకుని పరామర్శకు వస్తున్నారని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో ఎప్పుడైనా మామిడి రైతులకు రాయితీ ఇచ్చారా? అన్నారు. ఇప్పుడు మామిడి రైతులపై కపట ప్రేమతో చిత్తూరు పర్యటనకు వస్తున్నారని చెప్పారు. మరోవైపు ఏనాడూ మామిడి రైతులను పట్టించుకోని వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు కూడా ఇప్పుడు రాజకీయం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. జిల్లాలో ఏటా సుమారు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి ఉత్పత్తి జరుగుతుందని, ఈ ఏడాది అనూహ్యంగా సుమారు 6.5 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తోతాపురి మామిడి కిలోకు రూ.4 రాయితీ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలియజేశారు. అలాగే పల్ప్ ఫ్యాక్టరీల వారిని కిలోకు రూ.8 కచ్చితంగా ఇవ్వాలని చెప్పిందన్నారు. అయితే జిల్లాలో ఎక్కువ శాతం పల్ప్ ఫ్యాక్టరీలు వైసీపీ నేతల గుప్పెట్లోనే ఉన్నాయని ఆరోపించారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవాలనే ఉద్దేశంతోనే వారు కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. వైసీపీ నేతలు సిండికేట్‌గా ఏర్పడి ర్యాంపుల్లో తక్కువ ధరకే మామిడి కొనుగోలు చేసి, నిందలు మాత్రం ప్రభుత్వంపై వేస్తున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూలై 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ క్లస్టర్ మేనేజర్ సాగర్‌తో కలిసి బీమా యోజన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎంపిక చేసిన పంటలను సాగుచేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి.. నమోదు చేసుకున్న రైతులు ఈ పథకంలో చేరేందుకు అర్హులన్నారు. బీమా చేసిన మొత్తానికి రెండు శాతం, వాణిజ్య పంటలకు ఐదు శాతం వార్షిక ప్రీమియం రైతు చెల్లిస్తే, మిగిలిన మొత్తాన్ని బీమా కంపెనీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తాయన్నారు. జిల్లాలో పంటలవారీగా ఎకరా వరికి రూ.42వేలు, రాగికి రూ.17వేలు, కందికి రూ.20వేలు బీమా సౌకర్యం ఉంటుందన్నారు. వరికి రూ.840 వంతున ఆగస్టు 15లోగా, రాగులుకు రూ.170, కందికి రూ.400 ఈనెలాఖరులోగా ప్రీమియం చెల్లించాలని సూచించారు. బ్యాంకుల ద్వారా పంటరుణం తీసుకున్న రైతులకు రుణం పొందిన సందర్భంలో చెల్లిస్తారన్నారు. రుణం తీసుకోనివారు పోస్టాఫీసు, మీ-సేవ, సీఎస్‌ఎస్ సెంటర్, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల వద్ద సంబంధిత పత్రాలను అందించి ఆన్‌లైన్ ద్వారా పంట బీమా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. ఇతర వివరాలకు రైతుసేవా కేంద్రాల మండల వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలని చెప్పారు. ఇతర వివరాలకు క్లస్టర్ మేనేజర్ సాగర్‌ను 90596 34144 నెంబరులో సంప్రదించాలన్నారు. డివిజన్ కోఆర్డినేటర్లు ధనుంజయ, పెద్దన్న పాల్గొన్నారు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.68 కోట్లు



ఈవో పర్యవేక్షణలో హుండీ కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడి ఆలయ హుండీ ఆదాయం రూ.1,68,18,705 లభించింది. ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం స్వామి కానుకలను ఈవో పెంచలకిషోర్ ఆధ్వర్యంలో సిబ్బంది లెక్కించారు. 52 గ్రాముల బంగారం, కిలో నాలుగు గ్రాముల వెండితో పాటు 980 యూఎస్ఏ, 33 సింగపూర్, 140 కెనడా, 75 ఆస్ట్రేలియా డాలర్లు, 64 మలేసియా రింగిట్స్, 25 యూఏఈ దిర్హామ్స్ సమకూరినట్లు ఈవో తెలిపారు. దీంతోపాటు గోసంరక్షణ ట్రస్టు హుండీ ద్వారా రూ.16,783, అన్నదాన కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన హుండీ ద్వారా రూ.38,751 ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు. ఈ ఆదాయం పూర్తిగా ఆలయానికి 22 రోజుల్లో సమకూరిందని చెప్పారు. జిల్లా ఏసీ చిట్టెమ్మ, డీఈవో సాగర్‌బాబు, ఏఈవోలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు,హరిమాధవరెడ్డి, ధనంజయ, ప్రసాద్, ధనపాల్, సీఎఫ్‌వో నాగేశ్వరచౌదరి, పర్యవేక్షకులు కోదండపాణి, వాసు పాల్గొన్నారు.

త్రైమాసిక 'రిజిస్ట్రేషన్' రాబడి రూ.38.15 కోట్లు

● జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి



చిత్తూరు కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ప్రస్తుత ఆర్థిక సంవత్సర తొలి త్రైమాసికంలో రూ.38.15 కోట్ల రాబడి వచ్చిందని జిల్లా రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ 2025-26లో జిల్లా రిజిస్ట్రేషన్ రాబడి లక్ష్యంగా రూ.218 కోట్లను ప్రభుత్వం నిర్దేశించిందని చెప్పారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రూ.38.15 కోట్లు ఆదాయం వచ్చిందని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా బంగారుపాళ్యంలో రూ.2.05 కోట్లు, పలమనేరులో రూ.8.12 కోట్లు, కుప్పంలో రూ.5.55 కోట్లు, పుంగనూరులో రూ.4.40 కోట్లు, చిత్తూరు ఆర్వోలో రూ.9.67 కోట్లు, చిత్తూరు రూరల్‌లో రూ.3.74 కోట్లు, నగరిలో రూ.3.24 కోట్లు, కార్వేటినగరంలో రూ.1.34 కోట్లు ప్రభుత్వ ఖజానాకు ఆదాయం లభించిందన్నారు.ఆదాయార్జనలో చిత్తూరు ఆర్వో, పలమనేరు, కుప్పం ఎస్ఆర్‌లు ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాల్లో నిలవగా, చిట్టచివరి స్థానంలో కార్వేటినగరం ఎస్ఆర్ నిలిచిందన్నారు.

భక్తుల పైకి నిమ్మకాయలు విసురుతున్న అర్జున వేషధారి



కలెక్టర్‌కు పలువురి శుభాకాంక్షలు



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), జూలై 4(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా వెంకటేశ్వర్ బాధ్యతలు స్వీకరించి శుక్రవారం నాటికి సంవత్సరం పూర్తి కావడంతో కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్వో నరసింహులు, డీపీవో సుశీలాదేవి, ఎస్‌డీసీలు దేవేంద్రరెడ్డి, సుధారాణితో పాటు వివిధ శాఖల అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా అభివృద్ధిలో అందరి సహకారం ఉందని, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువయ్యేలా చూడాలని కలెక్టర్ వారికి సూచించారు.






సర్వే సత్యనారాయణ- చమక్ చంద్ర

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, జూలై4 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, సినీ హాస్య నటుడు చమక్ చంద్ర, తెలంగాణ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కలెక్టర్ వెంకటేశ్వర్ ఉన్నారు.

సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయారు. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.54 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,015

తలనీలాలు సమర్పించినవారు: 26,786



అర్జున తపస్సు

శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధమైన ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు జరిగింది. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన తపస్మాన్‌ను మెట్టుమెట్టుకు పద్యాలు పాడుతూ అర్జున పాత్రధారి అధిరోహించారు. ఈ ఉత్సవానికి భక్తజనం పోటెత్తారు. అర్జున పాత్రధారి మంత్రించి తపాస్మన్ నుంచి వెదజల్లే నిమ్మకాయల కోసం భక్తులు పోటీ పడ్డారు. ఈ నిమ్మకాయల వల్ల శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. కాగా, దీని కోసం ఏడు బస్తాల నిమ్మకాయలను సిద్ధం చేయగా అర్జున వేషధారి తాటిచెట్టుపైకి చేరుకునేటప్పటికి నాలుగు బస్తాలే పైకి పంపారు. మిగిలిన మూడింటిని కొందరు ఉద్యోగులు మాయం చేశారన్న ఆరోపణలు వచ్చాయి. దీనిపై భక్తుల్లో నిరాశ వ్యక్తమైంది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

అనుమానంతో తల్లీకొడుకుల దాడి

అవమానంతో మహిళ ఆత్మహత్య

● మృతదేహంతో బంధువుల ధర్నా



పోలీస్ స్టేషన్‌లోకి చొరబడుతున్న వారిని అదుపు చేస్తున్న పోలీసులు

పెళ్లకూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): తన భర్తకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో కుమారుడితో కలిసి ఆమె.. ఆ మహిళపై దాడి చేసింది. ఆ అవమానం భరించలేక బాధితురాలి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం.. పెళ్లకూరు మండలం పునబాక గిరిజన కాలనీలో అమాస సాయి, దుర్గ (22) దంపతులు ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ సాయి ఇంట్లోనే ఉండగా, దుర్గ కూలి పనులు చేస్తోంది. ఈ క్రమంలో బుధవారం సాయిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో దుర్గపై అదే గ్రామానికి చెందిన నీలం వెంకటసుబ్బయ్యగౌడ్ భార్య మస్తానమ్మ, ఆమె కుమారుడు అబ్దుల్ దాడికి పాల్పడ్డారు. దీనిని అవమానంగా భావించిన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. బంధువులు తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దుర్గ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు జరిగే సమయంలో ఈ దాడి విషయం తెలిసింది. వెంటనే బంధువులు ఆగ్రహంతో పెళ్లకూరుకు చేరుకుని పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై మృతదేహం ఉంచి ధర్నా చేపట్టారు. దుర్గపై దాడి చేసిన వారిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, పెళ్లకూరు, నాయుడుపేట, ఓజిలి, దొరవారిసత్రం ఎస్‌ఐలు నాగరాజు, ఆదిలక్ష్మీ, అజయ్‌కుమార్, స్వప్న, సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు నచ్చజెప్పి ధర్నా విరమింప జేశారు. అదే మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట బాధితులు మళ్లీ ధర్నా చేశారు. తమకు మద్దతుగా వచ్చిన దళితనేత యాగాన్ని బెన్నీపై దాడికి పాల్పడిన వెంకటసుబ్బయ్య గౌడ్ బంధువులను పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చే వరకు ధర్నా విరమింప చేసేదిలేదన్నారు. నిందితులను అరెస్ట్‌చేసి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతదేహన్ని తీసుకుని తమ కాలనీకి వెళ్లారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో కిలేడి

● ఆస్తికోసం భర్త, బిడ్డను వదిలేసి రెండో పెళ్లికి సిద్ధం

● తనపై దాడి చేస్తోందంటూ పెళ్లికుమారుడి తల్లి ఫిర్యాదు



మీడియాతో మాట్లాడుతున్న నాగరత్న

తిరుపతి(నేరవిభాగం), జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'భర్త, బిడ్డను కాదనుకుంది. డబ్బు కోసం రెండో పెళ్లికి సిద్ధమైంది. ఈ పెళ్లికి ఒప్పుకోని తనను వేధింపులకు గురిచేసి.. హత్యకు యత్నిస్తోందని పెళ్లికుమారుడి తల్లి, ఎస్వీఐ కాలనీకి చెందిన నాగరత్న భాగవతారిణి ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై శుక్రవారం ఎస్పీకి ఫిర్యాదు చేసిన ఆమె మీడియాతోనూ మాట్లాడారు. 'తిరుపతి నగరం భవానీనగర్‌లో బ్యూటీపార్లర్ నడుపుతున్న మహిళకు భర్త, కుమార్తె ఉన్నారు. నా కుమారుడు ఆర్.గోపినాథ్‌కు మాయమాటలు చెప్పి పెళ్లికి ఒప్పించింది. నేను సంపాదించిన ఇళ్లు, ప్లాట్లు, ఇతర ఆస్తులను దౌర్జన్యంగా తీసుకోవడానికి ఆమె నా కొడుకును పెళ్లి చేసుకుంటోంది. నేను ఒప్పుకోకపోవడంతో నా కుమారుడిని రెచ్చగొట్టి నానా ఇబ్బందులకు గురి చేస్తోంది. నా కుమారుడితో కలిసి నన్ను హతమార్చడానికి పథకం వేసింది. ఇందులో భాగంగా ఇద్దరూ కలిసి పెళ్లి పత్రికలు కొట్టించి నా ఇంటికొచ్చారు. గురువారం రాత్రి కూడా నాపై దాడికి దిగారు. దీంతో శుక్రవారం ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి వారిద్దరిపై ఫిర్యాదు చేశా'నని ఆమె పేర్కొన్నారు. దీనిపై పోలీసులు విచారించి, వారిద్దరి నుంచి తనకు ప్రాణ రక్షణ కల్పించాలని కోరారు.

గంజాయి మత్తులో వేధింపులు

● బాలిక బలవన్మరణం.. ముగ్గురిపై కేసు

తిరుచానూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభం శుభం తెలియని బాలికను ప్రేమపేరుతో గంజాయి మత్తులో ఓ యువకుడు వేధించాడు. అతడి కుటుంబీకులూ సహకరించారు. దీంతో ఆ బాలిక బలవన్మరణం చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్‌చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురంలో చిన్నబ్బ, రోజా దంపతులు ఉంటున్నారు. ఏడాది కిందట రోజా మృతిచెందింది. వీరి కుమార్తె గీతాంజలి(15) జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివింది. ఐదు నెలల కిందట జులాయిగా తిరిగే నవీన్‌తో ఈమెకు పరిచయం ఏర్పడింది. ఈ విషయం తెలిసి చిన్నబ్బ కుమార్తెను మందలించి మరో అద్దె ఇంట్లోకి మారాడు. అయినా నవీన్ ఫోన్ చేసి గంజాయి మత్తులో ఆమెను బెదిరించేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం నవీన్, అతడి తల్లి సుశీల, సోదరి కన్నెమ్మ బాలిక ఇంటికి వచ్చి దుర్భాషలాడారు. మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఉరేసుకుంది. బాలిక నానమ్మ ఆదిలక్ష్మి గుర్తించి కేకలు వేయడంతో స్థానికులు గడియ పగులగొట్టి లోపలకు వెళ్లారు. అప్పటికే ఉరికి వేలాడుతున్న గీతాంజలిని రుయాస్పత్రికి తరలించగా, మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమార్తె గీతాంజలిని ఆత్మహతకు ప్రేరేపించి వేధించిన నవీన్, అతడి కుటుంబీకులపై చర్యలు తీసుకోవాలని చిన్నబ్బ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయినాధ్‌చౌదరి తెలిపారు. నవీన్ నిత్యం గంజాయి తీసుకుని జులాయి తిరిగేవాడని ఎస్‌ఐ తెలిపారు. గీతాంజలి మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. నవీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

రెండో షెడ్యూల్‌లో ఎన్సీ 24




నాగచైతన్య కథానాయకుడిగా కార్తీక్ దండు దర్శకత్వంలో ఓ చిత్రం (ఎన్సీ-24-వర్కింగ్ టైటిల్) తెరకెక్కుతోంది. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. శుక్రవారం హైదరాబాద్‌లో రెండో షెడ్యూల్‌ను ప్రారంభించినట్లు యూనిట్ తెలిపింది. నెలరోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో నాగచైతన్యతో పాటు ప్రధాన తారాగణం అంతా పాల్గొంటోంది. ఈ సందర్భంగా యూనిట్ నాగచైతన్య పోస్టర్‌ను విడుదల చేసింది. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో తాడుతో మాస్ లుక్‌లో నాగచైతన్య ఆకట్టుకున్నారు. ఈ చిత్రానికి అజనీష్ బి లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రఘుల్ ధరుమాన్

వైరల్ వయ్యారి



గాలి జనార్దన్ రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా పరిచయమవుతున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలనచిత్రం బేనర్‌పై రజనీ కొర్రపాటి నిర్మించారు. శ్రీలీల కథానాయిక. ఈ నెల 18న ఈ చిత్రం విడుదలవుతోంది. చిత్ర బృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'జూనియర్' నుంచి రెండో పాటను యూనిట్ శుక్రవారం విడుదల చేసింది. 'వైరల్ వయ్యారి' అంటూ సాగే ఈ గీతానికి కల్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. దేవి శ్రీ ప్రసాద్ స్వరాలందించడంతో పాటు హరిప్రియతో కలసి ఆలపించారు. దేవి సంగీతంతో పాటు కిరీటి రెడ్డి, శ్రీలీల స్టెప్పులు ఈ పాటకు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కె. కె. సెంథిల్ కుమార్

పల్లెటూరి సరదాలు



మనోజ్ చంద్ర, మోనిక టి, ఉషా బోసెల ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న గ్రామీణ నేపథ్య వినోదాత్మక చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నటి, నిర్మాత ప్రవీణ పరుచూరి ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు. రానా దగ్గుబాటి సమర్పణలో గోపాల కృష్ణ పరుచూరి, ప్రవీణ పరుచూరి నిర్మిస్తున్నారు. ఈనెల 18న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ ఈ చిత్ర టీజర్‌ని విడుదల చేశారు. మనోజ్ చంద్ర రికార్డ్ డ్యాన్స్ స్టూడియోని నడుపుతున్న యువకుడిగా కనిపించాడు. పల్లెటూరి జీవితాన్ని, సరదాలని అద్భుతంగా ఈ చిత్రంలో చూపించబోతున్నామని చిత్రబృందం పేర్కొంది.

జెన్కో జోరు.. రికార్డు స్థాయిలో విద్యుదుత్పత్తి

- మార్కెట్లో కొనకుండానే కరెంటు సరఫరా
- అందుబాటులోకి శ్రీశైలం జలవిద్యుత్
- మొత్తం 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి
- డిమాండ్‌కు సరిపడా అందడంతో.. బయట కొనుగోలు చేయని డిస్కంలు

అమరావతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోళ్లకు వెళ్లకుండానే.. డిమాండ్‌కు సరిపడా కరెంటును ఏపీ జెన్‌కో ఉత్పత్తి చేస్తోంది. శుక్రవారం రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసింది. రాష్ట్ర విద్యుదుత్పత్తి సంస్థలు అందించిన సమాచారం మేరకు.. శుక్రవారం 199.498 మిలియన్ యూనిట్లను అవి ఉత్పత్తి చేశాయి. దీంతో.. మార్కెట్లో ఒక్క యూనిట్‌ను కూడా కొనుగోలు చేయకుండా డిస్కంలు డిమాండ్‌ను తట్టుకున్నాయి. శుక్రవారం ఏపీ జెన్కో ఆధ్వర్యంలోని థర్మల్ విద్యుత్కేంద్రాల్లో 78.015 మిలియన్ యూనిట్లు, జలవిద్యుత్కేంద్రాల్లో 19.869 మిలియన్ యూనిట్లు, జెన్కో సోలార్ కేంద్రాల్లో 1.588 మిలియన్ యూనిట్లు, సెంట్రల్ జనరేటింగ్ స్టేషన్లు 10.938 మిలియన్ యూనిట్లు, ఐపీపీ (సెయిల్, హెచ్ఎన్‌పీసీఎల్) 37.945 మిలియన్ యూనిట్లు, పవన విద్యుత్ 57.946 మిలియన్ యూనిట్లు, ప్రైవేటు సోలార్ 18.383 మిలియన్ యూనిట్లు, అంతర్రాష్ట్ర ఉత్పత్తి 1.206 మిలియన్ యూనిట్లు.. మొత్తం 199.498 మిలియన్ యూనిట్లను విద్యుత్ సంస్థలు అందించాయి. డిమాండ్ కూడా అంతే ఉండడంతో డిస్కంలు మార్కెట్లో కొనుగోలు చేయలేదు. శ్రీశైలం కుడిగట్టు జలవిద్యుత్కేంద్రంలో ఉత్పత్తి కొనసాగుతోంది. 720 మెగావాట్లు అందుబాటులోకి వచ్చింది. కృష్ణపట్నం థర్మల్ మూడో యూనిట్ నుంచి 750 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయింది. వీటితో కలిపే 199.498 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ఇంకోవైపు.. థర్మల్ విద్యుదుత్పత్తి బాగానే ఉన్నందున ప్లాంట్లలో బొగ్గు నిల్వలను ఇంకా పెంచాలని విద్యుత్ రంగ నిపుణులు చెబుతున్నారు. వీటీపీఎస్‌లో రోజుకు 41,500 మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం కాగా.. 13 రోజులకు సరిపడా 5,48,586 టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయి. ఆర్‌టీపీపీలో రోజుకు 28,500 టన్నులు అవసరం కాగా.. రెండున్నర రోజులకు సరిపడా 74,549 టన్నుల నిల్వలే ఉన్నాయి. కృష్ణపట్నం థర్మల్ ప్లాంట్‌లో రోజుకు 29,000 టన్నుల బొగ్గు అవసరం కాగా.. భారీగా 2,30,020 టన్నుల నిల్వలు ఉన్నాయి. సెయిల్‌లో రోజుకు 20,000 మెట్రిక్ టన్నుల బొగ్గుకు గాను 4,72,705 టన్నుల నిల్వలు ఉన్నాయి.

బకాయిలతో డిస్కంలు విలవిల..

రూ.7,562.48 కోట్ల బకాయిలు రాష్ట్ర డిస్కంలను భయపెడుతున్నాయి. నెలలోపే విద్యుత్ బకాయిలను తీర్చాలన్న నిబంధనలను దాటిన మొత్తాలు రూ.3,513.34 కోట్లు ఉన్నాయి. ఈ నెలలో చెల్లించాల్సిన బకాయిలు రూ.4,049.14 కోట్లు. ఈ మొత్తాలను తీర్చడానికి నిధుల కోసం డిస్కంలు అన్వేషణ ప్రారంభించాయి. అప్పులు తీర్చడానికి కొత్త అప్పులు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

ఇక 'స్మార్ట్' రేషన్ కార్డులు

- ఏటీఎం కార్డుల్లా రూపకల్పన
- క్యూఆర్ కోడ్‌తో వివరాలు ప్రత్యక్షం
- పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు
- నేతల ఫొటోలు లేకుండా ముద్రణ
- ప్రభుత్వ అధికారిక చిహ్నం, లబ్ధిదారు ఫొటో ఉండేలా చర్యలు
- సిద్ధమవుతున్న కొత్త స్మార్ట్ కార్డులు
- వచ్చే నెలలో పంపిణీకి ఏర్పాట్లు



అమరావతి, జూలై 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రేషన్ కార్డుల రూపుమారుతోంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారవుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం కార్డులకు పార్టీ రంగులు పులిమేసి.. వాటిపై ఒకవైపు జగన్ బొమ్మ, మరోవైపు వైఎస్ రాజశేఖరరెడ్డి బొమ్మను ముద్రించి పంపిణీ చేసింది. ఇప్పుడు వాటికి స్వస్తి చెప్పి.. రాజకీయ పార్టీల రంగులు లేకుండా, నేతల బొమ్మలు ముద్రించకుండా కొత్త కార్డులను రూపొందిస్తున్నారు. పాత వాటి స్థానంలో ఈ కొత్త కార్డులు జారీ చేయడంతో పాటు ఇకపై కొత్తగా మంజూరు చేసే కార్డులన్నీ కూడా స్మార్ట్ కార్డులుగానే ఉండనున్నాయి. బ్యాంకు ఏటీఎం కార్డు తరహాలో క్యూఆర్ కోడ్‌తో ఈ స్మార్ట్ రేషన్ కార్డును రూపొందిస్తున్నారు. ఈ కార్డుల జారీకి పౌరసరఫరాల శాఖ ఇప్పటికే కసరత్తును పూర్తి చేసింది. స్మార్ట్ రేషన్ కార్డుపై ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వ అధికారిక చిహ్నం, మరోవైపు కార్డుదారు (కుటుంబ పెద్ద) ఫొటో ఉంటాయి. ఆ రేషన్ కార్డు నంబరు, రేషన్‌షాపు నంబరు తదితర వివరాలుంటాయి. కార్డు వెనుకవైపు లబ్ధిదారు కుటుంబ సభ్యుల వివరాలుంటాయి. ఈ స్మార్ట్ రేషన్ కార్డును రేషన్ డీలర్ల వద్ద ఉండే ఈ-పోస్ యంత్రాల సహాయంతో స్కాన్ చేస్తే ఆ కుటుంబానికి సంబంధించిన వివరాలతో పాటు రేషన్ సరుకుల వినియోగానికి సంబంధించిన పూర్తి సమాచారం ప్రత్యక్షమవుతుంది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించే ఈ కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల ముద్రణ కోసం ఏపీటీఎస్ ద్వారా టెండరు ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ముద్రణ దశలో ఉన్న కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను వచ్చే నెలలో పంపిణీ చేసేందుకు పౌరసరఫరాలశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

2 లక్షల కుటుంబాలకు కొత్తగా లబ్ధి

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 1.46 కోట్లకుపైగా కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. వైసీపీ హయాంలో అర్హతలున్న నవదంపతులు, పేదలు రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నా అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో లక్షల సంఖ్యలో దరఖాస్తులు మూలనపడి ఉన్నాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం.. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో అర్హులైనవారందరికీ కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసింది. దీంతోపాటు తల్లిదండ్రుల నుంచి వేరుపడిన వారికి స్ప్లిట్ కార్డులు, ఉన్న రేషన్ కార్డులలో సభ్యుల చేర్పులు, తొలగింపులు, చిరునామాల మార్పులకు అవకాశం కల్పిస్తూ గత మే నెలలో దరఖాస్తులను స్వీకరించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రతి జిల్లా నుంచి లక్షలాదిగా వచ్చిపడిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల కోసం 1,47,187 మంది దరఖాస్తులు చేసుకోగా.. వారిలో 89,864 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 38,046 మంది దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. కుటుంబ విభజన (స్ప్లిట్) కార్డుల కోసం 1,43,745 మంది దరఖాస్తు చేసుకోగా.. వారిలో 1,09,787 మందికి కొత్త కార్డులు మంజూరు చేశారు. 20,403 దరఖాస్తులను తిరస్కరించారు. ఇలా కొత్తగా మంజూరు చేసిన దాదాపు 2 లక్షల కొత్త రేషన్ కార్డులలోని లబ్ధిదారులకు సెప్టెంబరు నెల నుంచి రేషన్ సరుకులు పంపిణీ చేసే అవకాశం ఉంది. కొత్తగా వచ్చిన కార్డులతో రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డుల సంఖ్య 1.48 కోట్లకు చేరింది.

రైతుల ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాకే జిల్లా పర్యటనకు రావాలి

● చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్



మీడియాతో మాట్లాడుతున్న కోదండయాదవ్

చిత్తూరు సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రైతుల ప్రశ్నలకు సమాధానం చెప్పాకే జిల్లా పర్యటనకు మాజీ సీఎం జగన్ రావాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎప్పుడైనా మామిడి రైతులకు రాయితీ ఇచ్చారా.. డ్రిప్ ఇరిగేషన్ పథకంలో ఒక అడుగు పైప్‌లైన్ అయినా మంజూరు చేశారా.. అని ప్రశ్నించారు. అలాగే మాజీ మంత్రి పెద్దిరెడ్డికి చెందిన పీఎల్ఆర్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో, వైసీపీ నేత ప్రకాష్ రెడ్డికి చెందిన సీజీఆర్ ఫుడ్స్ ఫ్యాక్టరీలో రైతుల నుంచి మామిడి కిలో రూ.3 కొనుగోలు చేయడం నిజం కాదా..? అన్నారు. ప్రశాంతంగా ఉన్న జిల్లాలో అలజడి సృష్టించేందుకే జగన్ రైతుల పరామర్శ పేరుతో జిల్లాకు వస్తున్నారని విమర్శించారు. నేతలు నరసింహ నాయుడు, శరవణ కుమార్, శేఖర్ రాజు, అరుల్ నాదన్, ఎతిరాజులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి: చుడా చైర్‌పర్సన్



సమావేశంలో ప్రసంగిస్తున్న కఠారి హేమలత

శ్రీరంగరాజపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత అన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో 23 పంచాయతీల పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకుల సమన్వయంతోనే గ్రామ కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగిందని చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, రుద్రప్ప నాయుడు, గంధమనేని రాజశేఖర్ నాయుడు, వెంకటేష్‌రెడ్డి, హేమాద్రి, ఎన్.కుమార్, గుండయ్య, బాబు నాయుడు, వెంకటాచలం, నిరంజన్‌రెడ్డి, పైనేని మురళి, మాధవ నాయుడు, నోమేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమేని జయశంకర్ నాయుడు అన్నారు. శుక్రవారం డి.కె.మర్రిపల్లెల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి: టీడీపీ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెనుమూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పెనుమూరు టీడీపీ నాయకులు అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమాన్ని శుక్రవారం పెనుమూరులోని అంబేడ్కర్ కాలనీ, మండల పరిధిలో తాటిమాకులపల్లెలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఏడాదిపాలనపై ప్రజాభిప్రాయాలను టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రుద్రయ్య నాయుడు, పెనుమూరు మాజీ సర్పంచి కృష్ణమూర్తి నాయుడు, నాయకులు తలారి రెడ్డెప్ప, ఆకోశ్, ప్రేమ్‌కుమార్, బాలాజి, మోహన్, సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హైరోడ్డు విస్తరణ పనులు



గోడను తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, ఎమ్మెల్యే మార్గనిర్దేశంలో నగరపాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశాలతో హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం కట్టమంచి ద్రౌపదమ్మ ఆలయం పక్కనే ఉన్న ప్రైవేటు స్థల యజమానిని ఒప్పించి వంద అడుగుల స్థలాన్ని తీసుకున్న అక్కడున్న గోడను ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి చెట్ల నరికివేత



మామిడి చెట్లను నరికేస్తున్న సుధాకర్

పూతలపట్టు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): చేతికి అందిన మామిడి పంటను కొనేవారు లేక కళ్లముందే నేలపై కాయలు పడి కుళ్లిపోతున్నాయి. ఆ బాధ తట్టుకోలేక మామిడి చెట్లను నరికేశాడు పూతలపట్టు మండలం వేపనపల్లి గ్రామానికి చెందిన సుధాకర్. ఈయనకు రెండెకరాల మామిడి తోపు ఉంది. ఈ ఏడాది కాపు బాగా వచ్చింది. మామిడికాయలు అమ్ముకుంటే కష్టాలు తీరుతాయని ఆశపడ్డాడు. ఓవైపు ధరలు లేకపోవడం.. మరోవైపు కొనేవాళ్లు లేకపోవడంతో మామిడికాయలు చెట్లలోనే మాగి కింద పడిపోతున్నాయి. ఆ ఆవేదనతో శుక్రవారం సుమారు 80 చెట్లను ఆ రైతు నరికేశాడు.

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



మల్లీశ్వరికి చెక్కును అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అనారోగ్య కారణాలతో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు శుక్రవారం ఎస్పీ మణికంఠ ఆర్థికసాయం చేశారు. జిల్లా స్పెషల్ బ్రాంచీలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మురళీకృష్ణ గత నెల 21న అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన సతీమణి మల్లీశ్వరికి ఐడీఆర్ఎఫ్ కింద రూ.లక్ష చెక్కును అందించారు. ఎస్ఆర్‌పురంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఆనంద్‌బాబు ఈ ఏడాది ఏప్రిల్ 1న అనారోగ్యంతో మరణించాడు. ఆయన సతీమణి మాధవికి కార్పస్ ఫండ్ నుంచి రూ.లక్ష, గుడుపల్లె పోలీసుస్టేషన్‌లో మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న లక్ష్మీ ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీన మరణించారు. ఆమె భర్త హరీష్‌కు కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చెక్కును అందించారు.

మోసగాళ్లు చంద్రబాబు, పవన్ కల్యాణ్

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను నెరవేర్చని మోసగాళ్లు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అంటూ మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి విమర్శించారు. శుక్రవారం కార్వేటినగరం మండలం కొల్లాగుంట వద్ద ఓ కళ్యాణమండలంలో నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి అధ్యక్షతన వైసీపీ శ్రేణుల సమావేశం జరిగింది. ఈ క్రమంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. చంద్రబాబు పాలనలపై నారాయణస్వామి విమర్శలు గుప్పించారు.

చిలకం రామచంద్రారెడ్డికి నివాళి



విజయపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు చిలకం రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయనకు శుక్రవారం పలువురు నివాళి అర్పించారు. మంగళంలోని ఆయన స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు చిలకం ఈశ్వరప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు కైలాసం యాదవ్, సర్పంచ్ యుగంధర్ రాజు, పురుషోత్తంరెడ్డి, నిండ్ర, నగరి, విజయపురం బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినులతో పనులు



చెత్తను తరలిస్తున్న విద్యార్థినులు

తవణంపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అరగొండ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులతో చెత్త తరలించే పనులు చేయించారు. దీనిపై స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ సంఘటనపై ఎంఈవో హేమలతను శుక్రవారం వివరణ కోరగా.. విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్



ఎమ్మెల్యే జగన్మోహన్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

చిత్తూరు సిటీ, జూలై 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నగరంలోని 7,8,9,10 డివిజన్ల పరిధిలోని కొంగారెడ్డిపల్లె, కుమార్ నగర్ కాలనీ, గాంధీ నగర్, ఎన్‌బీ కాలనీల్లో ఆయన పర్యటించారు. ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఒక ఇంట్లో చిన్నారి చేత 'నారా' అని అక్షరాలు దిద్దించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తారని చెప్పారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, నేతలు కాజూరు బాలాజి, త్యాగరాజు, రాజశేఖర్, శేషాద్రి, శంకర్, వినోద్ కుమార్, సతీష్, మధు, శివాజి, కనకరాజులు నాయుడు, మదన, అన్నపూర్ణ, అములు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను 90 శాతం నెరవేర్చాం: ఎమ్మెల్యే భానుప్రకాష్



ఆర్పీలకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నిండ్ర, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం నెరవేర్చామని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తెలిపారు. శుక్రవారం నిండ్రలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడాది ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు తన నాలుగున్నర దశాబ్దాల రాజకీయ అనుభవంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిస్తున్నారని ప్రశంసించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, శ్రీశైలం బోర్డు మాజీ చైర్మన్ చక్రపాణి రెడ్డి, నాయకులు దశరథవాసు, వెంకటేశులు నాయుడు, రవినాయుడు, కార్యదర్శి విజయ్‌కుమార్, చిట్టిబాబు నాయుడు, భాస్కర్, శరవణ, ఆనంద్, సంపూర్ణమ్మ, పరదేశి, గాలి రమేష్‌నాయుడు, జగన్, నాగభూషణం రాజు, ఓం ప్రకాష్, తేజేష్, ఏబీరాజ్, ఆనందరాజు, స్వాయిరాజ్, నంద తదితరులు పాల్గొన్నారు.

తల్లికి వందనంతో మా కష్టాలు తీరాయి: తల్లికి వందనం పథకంలో తమ కష్టాలు తీరాయంటూ విద్యార్థుల తల్లులు తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యేకు, సీఎం చంద్రబాబుకు తమ పిల్లలతో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను తీసుకెళ్లడానికి ఉపయోగించే వందేభారత్ ఈ-ఆటోను సర్పంచ్‌కు పంపిణీ చేశారు. ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, సర్పంచులు వసంతమ్మ, సంపూర్ణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్పీలకు ట్యాబ్‌ల పంపిణీ

నగరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): స్వయంసహాయక సంఘాలకు మెరుగైన సేవలు అందించాలన్న దృక్పథంతోనే ఆర్పీలకు ట్యాబ్‌లను అందించడం జరుగుతోందని ఎమ్మెల్యే భానుప్రకాష్ తెలిపారు. నగరిలోని మెప్మా కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రూ.15,50,953 విలువైన 47 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, సీఐ విక్రమ్, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, టీఎన్‌టీయూసీ బాలాజి, కన్నయ్య, రమేష్‌రెడ్డి, సలీమ్, శ్రీధర్ మెప్మా సూపర్‌వైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం: యూటీఎఫ్



కరపత్రాలతో యూటీఎఫ్ నాయకులు

ఐరాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందామని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఆర్సీ భవనం వద్ద జరిగిన సంఘ కార్యవర్గ సమావేశంలో ఆయన ప్రసంగించారు. గ్రామస్తులతో ఉపాధ్యాయులు మమేకమై విద్యార్థుల నమోదును పెంచాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏకాంబరం, మండలాధ్యక్షుడు దేవరాజులు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు లీలావతి, సుధాకర్, సరోజమ్మ, అమ్ములు, రామకృష్ణయ్య, అనీఫ్ బాషా, హరిత, గుణసుందరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కరపత్రాల పంపిణీ



అముదాలపుత్తూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పాలసముద్రం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): 'సుపరిపాలనలో ముందడుగు' కార్యక్రమాన్ని శుక్రవారం అవుదాలపుత్తూరులో టీడీపీ జిల్లా కార్యదర్శి వాసునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలనపై కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలోటని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు రాజేంద్రన్, నాయకులు వాసుయాదవ్, తంగరాజ్, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



గుడిపాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో తొమ్మిది మంది ఉపాధ్యాయులు బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లారు. వీరిలో ఖాతుంబీ, శైలజారాణి, సరళ, హరిప్రియ, జ్యోతిర్మయి, భాగ్యలక్ష్మి, పద్మ, సంధ్యలను శుక్రవారం పాఠశాలలో విద్యా కమిటీ చైర్‌పర్సన్ టీఆర్ ఢిల్లీబాయి, హెచ్‌ఎం దుర్వాసులు ఆధ్వర్యంలో సన్మానించారు.

విద్యార్థినులకు విద్యాసామగ్రి వితరణ



యాదమరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు శుక్రవారం షేర్ జీసస్ వర్డ్ మినిస్ట్రీ సంస్థ ప్రెసిడెంట్ ఎల్.జోసెఫ్ దంపతులు రూ.60వేల విలువైన విద్యాసామగ్రిని వితరణ చేశారు. ప్రిన్సిపాల్ ఎ.పి.లలిత, పాఠశాల కమిటీ చైర్మన్ నవీన్, అధ్యాపకులు సి.మహేష్, దామోదర్ రెడ్డి, మధుసూధన్, సుధాకర్, భాస్కర్‌రెడ్డి, కనకాచారి, మదన్మోహన్, రాజరాజేశ్వరి, అరుణ పాల్గొన్నారు.

నేడు బీసీ హాస్టళ్ల అభివృద్ధి పనులపై చర్చా కార్యక్రమం

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్)నిధుల ద్వారా బీసీ హాస్టళ్ల అభివృద్ధి పనులపై శనివారం బీసీ బాలుర వసతి గృహంలో చర్చా కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు జిల్లా వెనుకబడిన సంక్షేమం, సాధికారత అధికారి రబ్బానీ బాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీపీ ఆక్వా కల్చర్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ ద్వారా రూ.12.80 లక్షల సీఎస్ఆర్ నిధులు మంజూరైనందని పేర్కొన్నారు. ఈ నిధులతో హాస్టల్ భవనాల వైట్‌వాష్, బోరు మోటార్ల అమరిక, ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు తదితర పనులు చేశామన్నారు. ఆర్థికసాయం చేసిన ఎంసీపీ ఆక్వాకల్చర్ యాజమాన్యానికి మురుగానిపల్లెలోని అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటుచేసినట్లు తెలియజేశారు. అధికారులు, సిబ్బంది పాల్గొనాలన్నారు.

గుడిపాల మండలంలో గంజాయి విక్రయాల జోరు

● చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడి ఆరోపణ

గుడిపాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): గుడిపాల మండలంలో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయని చిత్తూరు పార్లమెంటు టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యువత గంజాయికి బానిసలైన వారి కుటుంబాలు వీధులలో పడుతున్నాయని చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రామ్మోహన్‌ను కోరారు. బొమ్మసముద్రం, రాసనపల్లె, 197రామాపురం, చిత్తపారలో యువత ఎక్కువగా గంజాయికి బానిసయ్యారన్నారు.

వృద్ధులకు రూ.4వేల పింఛను ఇచ్చేది ఏపీలోనే: టీడీపీ



మొలకలకంద్రిగ నేతలతో కలిసి కరపత్రాలను పంపిణీ చేస్తున్న కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా మన రాష్ట్రంలోనే వృద్ధులకు రూ.4వేల పింఛను ఇస్తున్నారని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు అన్నారు. 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమాన్ని అంబోధరపల్లె, పాతపాళ్యం పంచాయతీల్లో నిర్వహించారు. టీడీపీ నేతలు బాలాజి మొబైల్స్ వెంకటేశులునాయుడు, శ్రీధర్‌యాదవ్, బాబునాయుడు, స్వామిదాస్, దేవసుందరం, లక్ష్మణ్‌రెడ్డి, మనుపాటి వెంకటేశులునాయుడు, యంప్రాల వెంకటేశులునాయుడు, లోకనాధయాదవ్, అశోక్ నాయుడు, సుధాకర్‌నాయుడు, రామ్మూర్తినాయుడు, లక్ష్మీపతినాయుడు, మేస్త్రీ శివనాయుడు, మణి, విభూషన్, జీవరత్నం, శాంతకుమార్, రవి పాల్గొన్నారు

వంగవీటి రంగాకు నివాళి

చిత్తూరు కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కాపు, బలిజ సంఘం నాయకుడు వంగవీటి రంగా జయంతి సందర్భంగా నగర బలిజసంఘం ప్రతినిధులు శుక్రవారం నివాళి అర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. నాయకులు వీకే విశ్వనాథ్, ఈరణి తులసిరామ్, కోలా కిరణ్, కటారి కిషోర్, రామకృష్ణ, వరదరాజులు పాల్గొన్నారు.

నగరి: నియోజకవర్గ కాపుసంఘం అధ్యక్షుడు ఎం.వి.బాబు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కేజే కుమార్, నాయకులు కోదండరామ్, దామునాయుడు, శేఖర్, మునిరత్నంనాయుడు, చంద్ర, గోపిరాయల్, భాస్కర్, మోహన్‌బాబు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు



వెదురుకుప్పం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మహాభారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ఆవరణంలో అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా జరిగింది.అంతకుముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరిగాయి. గ్రామోత్సవంలో భాగంగా అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. అర్జున వేషధారి పాశుపతాస్త్రం కోసం జరిగే తపస్మాన్ కార్యక్రమాన్ని అర్జున వేషధారి నాటక రూపంలో ప్రదర్శించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షులు మేళం రవియాదవ్, ప్రధానకార్యదర్శి బి.గౌతమ్‌రాజు, ఉపాధ్యక్షుడు కె.రవిరెడ్డి, కోశాధికారి కె.లక్ష్మీపతి, ఉపకోశాధికారి ఆర్.సాయిరాయల్ పర్యవేక్షించారు.

10న పౌర్ణమి గిరి ప్రదక్షిణ

చిత్తూరు కల్చరల్ జూలై 4 (ఆంధ్రజ్యోతి): గిరింపేట చెంగల్రాయకొండ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో ఈనెల 10న పౌర్ణమి గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్బారెడ్డి తెలిపారు. అలాగే గిరింపేట సత్యసాయి సంస్థాన్ సత్యసాయి బాబాకు పౌర్ణమి పల్లకి సేవను భక్తులు నిర్వహిస్తున్నట్లు సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు తెలిపారు.

అభివృద్ధికి మారుపేరు చంద్రబాబు: ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధికి మారుపేరు సీఎం చంద్రబాబు అని స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. వావిల్‌తోట పంచాయతీలో శుక్రవారం రాత్రి జరిగిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం అన్నిరకాలుగా వెనుకబడిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన ప్రతిఒక్క హామీని నెరవేరుస్తున్నారన్నారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందని అన్నారు. ప్రతి గ్రామంలోనూ ఎమ్మెల్యేకు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, మాజీ కన్వీనర్ ప్రతాపనేని చంద్రమౌళి, నాయకులు జగన్నాథం, మధు, నాదముని, రామ్మూర్తి నాయుడు, గోవర్ధన, నరసింహులు, భార్గవ్, సురేంద్ర, నాగరాజు, ఐరాల, తవణంపల్లె, యాదమరి, బంగారుపాళ్యం మండలాల అధ్యక్షులు గంగారపు హరి, దిలీప్, మురార్జీ, ఎస్పీ ధరణి పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

చెత్త సేకరణ పనుల తనిఖీ

పాలసముద్రం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వెంగళరాజుకుప్పంలో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న చెత్తను శుక్రవారం ఎంపీడీవో సతీష్ తనిఖీ చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఎస్‌డబ్ల్యూపీసీలకు తరలించాలని సూచించారు. కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు

తవణంపల్లె, జూలై 4 (ఆంధ్రజ్యోతి): టి.పుత్తూరులోని కోదండరామాలయంలో శనివారం ఈనెల 19వ తేదీవరకు స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి తెలిపారు. సాయంత్రం అంకురార్పణ, ధ్వజారోహణం నిర్వహించి బ్రహ్మోత్సవాలను ప్రారంభించనున్నట్లు వివరించారు.

పీర్ల ఊరేగింపు



యాదమరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా యాదమరిలోని పక్టిక్ ముస్లింవాడలో పీర్లకు పూజలు చేసి, శుక్రవారం ఊరేగించారు. శనివారం రాత్రి పీర్లతో అగ్నిగుండం తొక్కి అన్నదానం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

స్వామి వివేకానందకు నివాళి

చిత్తూరు కల్చరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కట్టమంచి చెరువు వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వద్ద బీజేపీ నాయకులు శుక్రవారం నివాళి అర్పించారు. వివేకానందుడి వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నేతలు చిట్టిబాబు, జయకుమార్, రెడ్డి మసాన్, సన్‌పీర్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లసముద్రం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యాసామగ్రిని విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య వితరణ చేశారు. హెచ్‌ఎం వంశీకృష్ణ, ఎస్‌ఎంసీ చైర్మన్ జగన్‌రాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అతిసార వ్యాధిపై అవగాహన

పూతలపట్టు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అతిసార వ్యాధిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అవగాహన కల్పించారు. అధికారులు నాగరాజు, నందకుమార్, శ్రీనివాసులు, చంద్రమౌళి, శివప్రకాష్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి ఆదర్శనీయుడు: రోజా

విజయపురం, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు ఆదర్శనీయుడని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం విజయపురం కూడలిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వైసీపీ మండల అధ్యక్షుడు శివరాజు, నాయకులు గుణశేఖర్‌రెడ్డి, గోవర్ధన్‌నాయుడు, శేఖర్‌రాజు, చెంచువరప్రసాద్ పాల్గొన్నారు.

36 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 36 మందికి జడ్జి జరిమానా విధించారని ఒకటో పట్టణ సీఐ మహేశ్వర తెలిపారు. రెండ్రోజులుగా మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురిపై, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన 30 మందిపై కేసు నమోదు చేశారు. వీరందరినీ శుక్రవారం రెండో తరగతి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. మద్యం తాగి వాహనాలు నడిపిన ఒక్కొక్కరికి రూ.10వేలచొప్పున, బహిరంగ ప్రదేశాల్లో మద్యంతాగిన వారికి రూ.1000 చొప్పున జరిమానా విధించారు.

మద్యంషాపుపై దాడి

చిత్తూరు అర్బన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అప్పుగా మద్యం ఇవ్వలేదనే కారణంతో ఓ వ్యక్తి మద్యం షాపుపైనే దాడిచేశాడు. నగరంలోని సాంబయ్యకండ్రిగకు చెందిన సురేష్. ఎస్టేట్‌లోని పెగ్స్ (పీఈజీఎస్) వైన్‌షాపులో రోజూ మద్యం తాగేవాడు. శుక్రవారం డబ్బులు లేకపోవడంతో మద్యం షాపులో అప్పు అడిగాడు. నిర్వాహకులు నిరాకరించడంతో ఆగ్రహానికి గురైన సురేష్.. ఆషాపు అద్దాలను పగులగొట్టాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.